ప్రవేశిక

"ఖ్యాతి గడించు కొన్న కవు లందరు లేరె! అదేమి చిత్రమో
పోతన యన్నచో కరిగిపోవు నెడంద; జొహారు సేతకై
చేతులు లేచు; ఈ జనవశీకరణాద్భుతశక్తి చూడగా
నాతని పేరులో గలదొ! ఆయన భాగవతాన నున్నదో!"

రాజు కాని మహారాజు, రాజ్యంలేని కవిరాజు, రాజభోగాలు ఆశించని రాజరాజు, ఆడంబరాలకూ అహంకారాలకూ త్రోసిరాజు మన బమ్మెరపోతరాజు.

"గుడులు కట్టించె కంచెర్ల గోపరాజు
రాగములు కూర్చె కాకర్ల త్యాగరాజు
పుణ్యకృతి చెప్పె బమ్మెరపోతరాజు
రాజు లీ మువ్వురును భక్తి రాజ్యమునకు."

అన్నట్లు గోపన్న కొండల్లో బండల్లో రాముడికి గుళ్ళు కట్టిస్తే పోతన్న తెలుగు గుండెల్లో కృష్ణుడికి గుళ్లు కట్టించాడు. త్యాగరాజు తన తంబూరా తీగెలమీద "రఘుకుల తిలకుణ్ణి" ఊరేగిస్తే పోతరాజు తన నవపల్లవ కోమల శయ్యల మీద యదుకుల తిలకుణ్ణి ఉయ్యాల లూగించాడు.

"మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షిః" అన్న సుకవి సూక్తికి సంస్కృతంలో వాల్మీకిలాగా తెలుగులో పోతన్న ఉజ్జ్వలమైన ఉదాహరణం. "కవిత్వ" మనే పాలలో "భక్తి" అనే పంచదార కలిపి భాగవత రసాయ నాన్ని పాకంచేసి లోకానికి అందించిన అమృతహస్తం పోతన్నగారిది. ఆయన కావ్యకన్యక తెలుగు వారి గుండెల్లో "మందార మకరందాలు" చిందించింది. తెలుగు జాతిని "నిర్మల మందాకినీ వీచికల్లో" ఓలలాడించింది.

"విద్యావతాం భాగవతే పరీక్షా" అనే కొమ్ములు తిరిగిన పండితులకుకూడా "కొరకరాని కొయ్య" అయిన సంస్కృత భాగవతం సహజ పాండిత్యుని హస్తస్పర్శతో "బాలరసాలం" గా పరిణమించి పల్లవించి పుష్పించి ఫలించి ఆబాలగోపాలానికీ రసానందాన్ని అందించింది.

మహాభక్తుడైన పోతన్నగారు పొంగి పులకించిన హృదయంతో గజేంద్రమోక్షంలో, వామన చరిత్రలో, ప్రహ్లాద వృత్తాంతంలో, రుక్మిణీ కల్యాణంలో, నరకాసురవధలో, కృష్ణలీలల్లో, గోపికా గీతాల్లో, కుచేలోపా

ఖ్యానంలో తన ప్రతిభా పాండిత్యాలను ప్రకటించి మూలాన్ని పెంచి సర్వాంగసుందరంగా సాహిత్యమందిరంగా ఆ యా ఘట్టాలను తీర్చిదిద్దాడు. కొన్ని చోట్ల మూలంలోని మూడు శ్లోకాలను ముప్పై మూడు పద్యాలుగా ప్రపంచీకరించాడు.

భాగవత కవిత్వం నిత్యనూతనం. సత్యసనాతనం. అయిదు వందల సంవత్సరాలు గడచిపోయినా బమ్మెరవారి భాగవత బాలరసాల నవపల్లవాలు పసివాడలేదు. కనుగంద లేదు, భాగవతం కోసమే పోతన్న గారు పుట్టారు. పోతన్నగారి కోసమే పూర్వకవు లెవ్వరూ ముట్టుకోకుండా భాగవతాన్ని అట్టిపెట్టారు. తనకు వ్యాసులవారి భాగవతం ప్రాప్తించటం తన పురాకృత సుకృత విశేషం అన్నారు పోతన్నగారు. మనకు పోతన్నగారి భాగవతం లభించటం మన జన్మ జన్మాల పుణ్యవిశేషం అంటాను నేను.

పోతన్నగారు మనలో ఎంతగానో కలిసిపోయారు! మనసులో, మాటలో, పాటలో, పద్యంలో, నుడికారాలలో, ఆచారాలలో వెలుగులా వెన్నెలలా మలయమారుతంలా కలిసిపోయారు! తెలుగువారి నిత్యజీవితాలలో, నిండు హృదయాలలో, ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో ఆయన నిండి ఉన్నాడు.

ఉదయభానుని కిరణాలలో, యదుకిశోరుని మృదుచరణాలలో చల్లలమ్మే గొల్లభామల్లో, విలుపట్టిన సత్యభామలో, వల్ల వాంగనల వలపుల్లో, పిల్లనగ్రోవి పిలుపుల్లో ఆయన కనిపిస్తాడు- వినిపిస్తాడు- "ఆహా" అనిపిస్తాడు.

భాగవతం విప్పితే చాలు- పుటలు తిప్పితే చాలు-

"నీకున్ మ్రొక్కెద ద్రెంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!" అంటూనో,

"ఒక సూర్యుండు సమస్తజీవులకు తా నొక్కొక్కఁడై తోఁచు పోలిక....." అంటూనో-

"రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!" అంటూనో-

"కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ....." అంటూనో-

"ఘనుఁ డా భూసురుఁ డేగెనో! నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో!....." అంటూనో-

"వనితా! ఏమి తపంబు చేసెనొకొ ఈ వంశంబు వంశంబులోన్....." అంటూనో-

కుంతీదేవిగా, ఆచార్యభీష్ముడుగా, గజేంద్రుడుగా, ప్రహ్లాదుడుగా, రుక్మిణీ కన్యగా, వ్రేపల్లె గోపికగా వేషాలు మార్చి గొంతులు మార్చి పోతన్నగారు మనకు దర్శనమిస్తూనే ఉంటారు. భాగవత పాత్రలతో ఆయన తాదాత్మ్య మటువంటిది.

"నా తోడన్ ప్రతిభాష లాడెదు, జగన్నాథుండు, నా కంటె నీ, భూతశ్రేణికి రాజు లేఁడొకడు" అని కన్నకొడుకును గద్దించే హిరణ్యకశిపుడూ,

"తిరుగ న్నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య! వేయేటికిన్" అని పలికే దానవీరుడు బలి చక్రవర్తి,

"అమ్మా! మన్ను దినంగ నే శిశువనో! ఆఁకొంటినో! వెఱ్ఱినో!" అని తల్లి దగ్గర ముద్దులు గురిసే బాలగోపాలుడూ,

"తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్ల బంధంబుతో" పతివెంట పరువెత్తుకొని వస్తున్న శ్రీదేవీ,

"మన సారథి మన సచివుఁడు... మనలను విడనాడి చనియె మనుజాధీశా!" అని కన్నీళ్లు తుడుచు కొంటూ అన్నగారికి కృష్ణ నిర్యాణ వార్త విన్నవిస్తున్న అర్జునుడూ,

"ఆసుర కృత్యంబు ధర్మ మగునే తండ్రీ?" అని పుత్రఘాతి అయిన అశ్వత్థామను ప్రశ్నిస్తున్న పాంచాల రాజపుత్రీ,

"అన్న శమింపుమన్న! తగ దల్లుఁడు గాడిది మేనకోడలౌ మన్ననసేయగదన్న!" అని అన్నగారిని బతిమాలే దేవకీదేవీ-- మన హృదయ ఫలకాలమీద చెరగని ముద్రవేసి మన కన్నుల ముందు కలకాలం కదలాడుతూనే ఉంటారు.

ప్రాచీన కవుల పద్యాలతో సంవదించే పద్యాలు కొన్ని పోతన్న గారి భాగవతంలో అక్క డక్కడ గోచరిస్తాయని ఒక ఆక్షేపణ ఉంది. అది వాస్తవంగా ఆలోచిస్తే పోతన్నకు ఉత్కర్షేకాని అపకర్ష ఏ మాత్రం కాదు. అలా వ్రాసినందువల్ల పోతన్న గారికి తనకంటే పూర్వకవులమీద ఉండే పూజ్యభావమూ, ఆదరాభిమానాలూ అభివ్యక్త మవుతాయి. అటువంటి విధంగా సంవదించే పద్యాలు పూర్వకవుల పద్యాలతో సరి సమానంగానూ, కొన్ని చోట్ల పూర్వకవి పద్యాలకు మెరుగులు దిద్దేవిగానూ ఉన్నాయి.

నన్నయ భట్టారకులు ఆదిపర్వంలో మహాభారతాన్ని పారిజాతంతో పోలుస్తూ ఈ క్రింది పద్యం వ్రాశారు-

అమితాఖ్యానకశాఖలం బొలిచి, వేదార్థామలచ్ఛాయమై
సుమహావర్గచతుష్కపుష్పవితతిన్ శోభిల్లి, కృష్ణార్జునో
త్తమ నానాగుణకీర్తనార్థ ఫలమై, ద్వైపాయనోద్యాన జా
త మహాభారత పారిజాత మమరున్ ధాత్రీసుర ప్రార్థ్యమై. **(ఆది. 1-64)**

నన్నయ్యగారిమీది గౌరవంతో ఆయన భావాన్నే స్వీకరించి పోతన్న తన భాగవతాన్ని కల్పతరువుతో పోలుస్తూ అటువంటి మత్తేభాన్నే నడిపించారు. చిత్తగించండి-

లలిత స్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామమ్ము, మం
జులతా శోభితమున్, సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్, సుందరో
జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు పుర్విన్ సద్ద్విజశ్రేయమై. **(భాగ. 1-20)**

నన్నయ్యగారి పారిజాతాన్నీ పోతన గారి కల్పవృక్షాన్నీ పోల్చిచూడండి. నన్నయ్యగారి పద్యంలో రూపకాలంకారంతో కూడిన విశేషణాలు ఆరు ఉంటే పోతన్న గారి పద్యంలో పది విశేషణాలు ఉన్నాయి. పైగా శ్లేషాలంకార సమాశ్లేషంతో రూపకాలంకారంతో రూపు దిద్దుకుంది. నన్నయ్యగారి అడుగుజాడల్లో నడచిన చక్కదనాల పద్యమిది. హృద్యానవద్యమైన ఈ పద్యంవంటి పద్యం ఆంధ్రసాహిత్యంలో మరొక్కటి లేదనటంలో అతిశయోక్తి లేదు. ఈ పద్యాన్ని నన్నయ్యగారే వింటే "నాకంటే బాగా వ్రాశావోయి నాయనా!" అని పోతన్నగారి వీపు తట్టి ఆశీర్వదించి ఉండేవారు.

సంధికార్యంకోసం రాయబారియై పాండవుల పంపున హస్తినాపురానికి విచ్చేసిన శ్రీకృష్ణుణ్ణి పౌరకాంతలు సౌధాగ్రాలమీది నుంచి సందర్శించే సందర్భంలో తిక్కన సోమయాజి ఈ పద్యం వ్రాశాడు-

ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె!
వ్రేల్మిడి చాణూరు విఱిచి లోకముల మెచ్చించిన యా జగజెట్టి యితఁడె!
దుర్వృత్తుఁడగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ బట్టంబు గట్టిన ప్రభు వితండె!
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గలకోర్కి దీర్చిన రసికుం డితండె!
వెన్నలును గోపికా చిత్తవృత్తములును, నరసి ముచ్చిల నేర్చిన హరి యితండె!
శ్రుతి శిరోభాగములఁ దన సుభగచరణ సరసి, జామోదమును గూర్చు చతురుఁడితఁడె!!

(ఉద్యో. 3-175)

తిక్కనగారి ఈ సీసానికి సమానంగా పోతన్నగారు మరొక సీసపద్యం వ్రాశారు. కంసుని ఆహ్వానం అందుకొని మధురా నగరానికి విజయం చేసిన శ్రీకృష్ణుని అక్కడి స్త్రీలు మేడలమీద నుంచి చూస్తున్న దృశ్య మిది.

వీఁడటే! రక్కసి విగతజీవగఁజన్నుఁ బాలు ద్రావిన మేటి బాలకుండు

వీఁడటే! నందుని వెలఁదికి జగ మెల్ల ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు

వీఁడటే మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దాఁపరీఁడు

వీఁడటే! యలయించి వ్రేతల మానంబు సూఱలాడిన లోక సుందరుండు

వీఁడు లేకున్న పుర మటవీస్థలంబు, వీనిఁ బొందని జన్మంబు విగత ఫలము

వీనిఁ బలుకని వచనంబు విహగ రుతము, వీనిఁ జూడని చూడ్కులు వృథలు వృథలు.

(దశమ.1-1248)

ఇరువురు మహాకవుల సీసాలూ రసోల్లసితాలే. హస్తినాపుర కాంతలకు కనిపిస్తున్నవాడు ప్రౌఢ వయస్కుడైన శ్రీకృష్ణుడు. మధురానగర నారీమణులకు కనువిందు చేస్తున్నవాడు నవయౌవనంతో నవనవలాడే గోపాలకృష్ణుడు. అందువల్ల పోతన్నగారి పద్యం కొంచెం శృంగారం వైపు మొగ్గింది. తిక్కన్న గారి పద్యంలో అర్థగాంభీర్యం, భావవైవిధ్యం అతిశయంగా ఉన్నమాట వాస్తవం. అయితే పోతన్న గారి పద్యంలో పాదాల మొదట “వీఁడటే వీఁడటే” అన్న దీర్ఘాంత పదాలు పౌరకాంతల ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ, ఉత్కంఠనూ, ఉత్సాహాన్నీ వెల్లడిస్తున్నాయి. మునివేళ్ళపై నిలిచి, చేతులు చాచి, వేలు పెట్టి చూపిస్తున్నట్లు ఈ పద్యంలోని ఎత్తుగడలు స్ఫురింపజేస్తున్నాయి. ఈ పద్యాన్ని తిక్కన్నగారు తిలకిస్తే “నీ పద్యం అభినయయోగ్యమై దర్శనకుతూహలాన్ని అతిశయింపజేస్తున్నది తమ్ముడూ”! అంటూ పోతన్నను అభినందించి ఆలింగనం చేసుకుంటాడేమో!

ఇక ఒకే సందర్భంలో నడచిన ఎఱ్ఱన్న పోతన్నల పద్యాలను పరిశీలించండి.

ఊషరబీజముల్, భసితయోగ్య ఘృతంబులు, షండకన్యకా

న్వేషణముల్, పయోధిగత వృష్టితతుల్, మృగతృష్ణికాంబు గం

డూషలు, దుర్గకానన కఠోరితచంద్రిక, లేడమూక స

ద్భాషలు విష్ణుమంగళ కథావిముఖాత్ముల దుష్టజన్మముల్. (నృసింహ. 5-24)

అంధేందూదయముల్, మహాబధిర శంఖారావముల్, మూక స

ద్గ్రంథాఖ్యాపనముల్, నపుంసక వధూకాంక్షల్, కృతఘ్నావళీ

బంధుత్వంబులు, భస్మహవ్యములు, లుబ్ధద్రవ్యముల్, క్రోడ స

ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థ సంసారముల్. (భాగ. 7-168)

పై రెండు పద్యాలు హరిభక్తి విముఖుల శుష్కజీవితాలను గురించి చెప్పినవే. పోతన్నగారు ఎఱ్ఱన్న గారి పద్యం చూచి తన పద్యం దిద్దితీర్చారనటంలో సందేహం లేదు. అయితే ఏ పద్యం ఏ పద్యంకన్న మిన్నగా ఉందో సహృదయ పాఠకులే తేల్చాలి.

పాల్కురికి సోమనాథుని ఈక్రింది ద్విపద పంక్తులు పరికించండి-

క్షీరాబ్ధి లోపలఁ గ్రీడించు హంస, గోరునే పడియల నీరు ద్రావంగఁ?

జూత ఫలంబులఁ జుంబించు చిలుక, బ్రాఁతి బూరుగు మ్రాని పండ్లు గొనునె?

రాకామల జ్యోత్స్నఁ ద్రావు చకోర, మాకాంక్ష సేయునే చీఁకటిఁ ద్రావ?

విరిదమ్మి వాసన విహరించు తేటి, పరిగొని సుడియునే ప్రబ్బలి విరుల? (బసవ. 3-82 పుట)

పాల్కురికివారి పై పంక్తుల భావాన్ని మనస్సులో పెట్టుకొనే పోతన్నగారు ఆంధ్ర సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధమైన ఈ క్రిందిసీస పద్యాన్ని సంతరించారు.

మందార మకరంద మాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే మదనములకు?

నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు రాయంచ చనునె తరంగిణులకు?

లలితరసాల పల్లవ ఖాదియై చొక్కు కోయిల చేరునే కుటజములకు?

పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరకం బరుగనే సాంద్రనీహారములకు?

నంబుజోదర దివ్యపాదారవింద, చింతనామృత పాన విశేషమత్త

చిత్తమే రీతి నితరంబుఁ జేరనేర్చు వినుత గుణశీల! మాటలు వేయునేల? (భాగ. 7-150)

ఇద్దరి రచనల్లో ఏది ముద్దులు మూటగట్టుతున్నదో, అందాలు చిందుతున్నదో ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు.

నరకాసురుణ్ణి సంహరించటం కోసం శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై వెళ్లాడు. వీర సాత్రాజితి శ్రీకృష్ణుని చేతి విల్లందుకొని నరకునిపై శరపరంపరలు కురిపిస్తున్నది. ఈ సందర్భంలో నాచన సోమనాథుని ఉత్తర హరివంశంలో ఈ పద్యం ఉన్నది.

అరిఁ జూచున్ హరిఁ జూచుఁ జూచుకములం దందంద మందార కే

సర మాలా మకరందబిందు సలిలస్యందంబు లందంబులై

తొరఁగన్, బయ్యెదకొం గొకింత తొలఁగన్, దోడ్తో శరాసారమున్

దరహాసామృతపూరమున్ గురియుచున్ దన్వంగి లీలాగతిన్. **(ఉ.హ. 1-162)**

సరిగా ఇదే సందర్భాన్ని పురస్కరించుకొని పోతన్నగారు భాగవతంలోపై పద్యంలాంటి పద్యాన్నే వ్రాశారు.

పరుఁ జూచున్ వరుఁజూచు, నొంప నలరింపన్, రోషరాగోదయా

విరత భ్రూకుటి మందహాసములతో, వీరంబు శృంగారమున్

జరగన్, గన్నులఁ గెంపు సొంపు బరఁగన్, జండాస్త్రసందోహమున్

సరసాలోక సమూహమున్ నెఱపుచున్ జంద్రాస్య హేలాగతిన్. **(భాగ. 10-2-178)**

ఇద్దరు కవుల పద్యాల్లోని సన్నివేశం సమానమే. ఇద్దరూ మత్తేభవృత్తంలోనే వ్రాశారు. ఇద్దరూ వీరనారీమణి సత్యభామా స్వరూపాన్నే అభివర్ణించారు. కాని చిత్రీకరణంలో భేదం ఉన్నది.

నాచన సోమనాథుని సత్యభామ కుచాగ్రములయందు ఆమె మెడలోని మందారమాల నుంచి మకరంద బిందువులు అందంగా చింది పడుతున్నాయి. పైటకొంగు రవంత జారింది. ఆమె వెంట వెంటనే శరపరంపరలనూ, చిరునవ్వులనూ వర్షిస్తూ నరకాసురుణ్ణి శ్రీకృష్ణుణ్ణి విలాసంగా చూస్తున్నది.

ఎదురుగా ఉన్న అరినీ, ప్రక్కనే ఉన్న హరినీ శరాసారం ప్రయోగిస్తూ, దరహాసామృతపూరం ప్రసరిస్తూ చూడటం వరకు బాగానే ఉన్నది. ఆమె మెడలోని మందారమాల యందలి మకరంద బిందువులు అందంగా ఆమె చూచుకములందు పడుతున్నాయనటం రణరంగంలో వీరావేశంతో విల్లెక్కుపెట్టిన సాత్రాజితిని కేవల శృంగారదేవతగా చిత్రించటంలో కొంత అనౌచిత్యం గోచరిస్తున్నది. "అందంద మందార కేసరమాలా మకరంద బిందు సలిల స్యందంబులు" ఎంత అందంగా ఉన్నా హరిని చూడటంలో సహజంగా ఉంటాయి కాని అరిని చూచేటప్పుడు చాలా అసహజంగా ఉంటాయి. అందుకనే పోతన్నగారు సోమన్న పద్యంలోని అనౌచిత్యాన్ని పరిహరిస్తూ సత్యభామలోని వీరశృంగారాలను సరిసమానంగా స్ఫురింపజేసే పద్యం వ్రాశారు.

పోతన్నగారి సత్యభామకూడ పరుణ్ణీ వరుణ్ణీ చూచింది. అయితే ఆమె చూపులలో అటు అణచివేయా లనే భావమూ, ఇటు అలరించాలనే భావమూ; అటు రోషోదయమూ, ఇటు రాగోదయమూ; అటు కన్నుల

కెంపూ, ఇటు కన్నుల సొంపూ, అటు చండాస్త్రపరంపరా, ఇటు సరసాలోక పరంపరా విరాజిల్లుతూ ఉన్నాయి. సోముని పద్యంలో శరాసారమూ, దరహాసామృతపూరమూ ప్రసరిస్తుంటే అటువంటి జంటలు పోతన పద్యములో ఆరు కనిపిస్తున్నాయి. ఈ విధంగా సాత్రాజితీ చిత్రణంలో బమ్మెరవారి మత్తేభం నాచన సోమన మత్తేభంకంటె నాలుగైదడుగులు ముందుకు వేసింది.

భాస్కర రామాయణంలోని పద్యాలకు సంవదించే పద్యాలుకూడా పోతన్న భాగవతంలో కనిపిస్తాయి. భాస్కరుడు చేసిన ఈ క్రింది దండకారణ్య వర్ణనం చూడండి.

పుణ్యచరిత్రుఁ డత్రిముని పుంగవు వీడ్కొని రాముఁ డంచితా
గణ్యగుణాభిరాముఁ డుపకంఠమునం జని కాంచె దండకా
రణ్యము, సిద్ధసంయమి విరాజిత, చారు తపోనుజాత స
త్పుణ్యము, నిర్మలాంబువర పుష్కరపూర్ణసరోవరేణ్యమున్. **(భా.రా. అరణ్య.1-2)**

ఇదే సందర్భంలో పోతన్న దండకారణ్యాన్ని ఈ విధంగా వర్ణించాడు.

పుణ్యుఁడు రామచంద్రుఁడట వోయి మందంబునఁ గాంచె దండకా
రణ్యముఁ దాపసోత్తమ శరణ్యము నుద్ధత బర్హిబర్హ లా
వణ్యము గౌతమీ విమలవాఃకణ పర్యటన ప్రభూత సా
ద్గుణ్యము నుల్లసత్తరు నికుంజవరేణ్యము నగ్రగణ్యమున్. **(భాగ. 9-267)**

ఇరువురు మహాకవులూ ఒకే వృత్తం ఒకే ప్రాస ఒకే అంత్యాను ప్రాస స్వీకరించారు. భాస్కరుడు దండ కారణ్యానికి రెండు విశేషణాలు వేస్తే పోతన ఐదు విశేషణాలు వేశాడు. అయితే ఉద్ధత బర్హిబర్హ లావణ్యము (మదించిన మయూరాల పింఛాలలోని నిగనిగలతో కూడినది) అన్న విశేషణమూ, ఉల్లసత్తరు నికుంజవరేణ్యము (చక్కగా వికసించిన చెట్లతో పొదరిండ్లతో నిండినది) అన్న విశేషణమూ అరణ్యశోభను మరింత వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా స్వచ్ఛమైన గోదావరీనది శీతలశీకరాలతో నిండి ఉన్నదనటం పోతన్నగారి ఆంధ్రాభిమానాన్ని అభివ్యక్తం చేస్తున్నది.

ఈ విధంగా పోతన్నగారి పద్యాలతో పూర్వకవుల పద్యాలతో సంవదించేవి ఉన్నప్పటికీ అవి సొంత విలువలు సంతరించుకొన్నవనీ, అది గ్రంథచౌర్యం కాదనీ, అందువల్ల పోతన్నగారి కవిత్వానికి ఎటువంటి లోటూ వాటిల్లదనీ మనకు అర్థమౌతుంది.

ప్రస్తుతం మీ కరకమలాలను అలంకరించిన గ్రంథం పోతన భాగవతం చతుర్థస్కంధం. ఈ స్కంధంలో ఐదు ప్రధానమైన ఘట్టాలు- దక్షాధ్వర ధ్వంసం, ధ్రువోపాఖ్యానం, పృథుచక్రవర్తి చరిత్రం, ప్రచేతసుల వృత్తాంతం, పురంజనోపాఖ్యానం అనేవి ఉన్నాయి.

దక్షాధ్వర ధ్వంసంలో శివద్రోహియైన దక్షునితో సతీదేవి ఇలా అంటుంది-

నీలగళాపరాధియగు నీకుఁ దనూభవ నౌట చాలదా!
చాలుఁ గుమర్త్య! నీదు తనుజాత ననన్ మది సిగ్గు పుట్టెడి
న్నేల ధరన్ మహాత్ములకు నెగ్గొనరించెడి వారి జన్మముల్
గాలుపనే తలంప జనకా! కుటిలాత్మక! యెన్ని చూడఁగన్.

వరవృషకేతనుండు భగవంతుఁడు నైన హరుండు నన్ను నా
దర పరిహాసవాక్యముల దక్షతనూభవ! యంచుఁ బిల్వ నేఁ
బురబురఁ బొక్కుచున్ ముదముఁ బొందక నర్మవచః స్మితంబులన్
దొఱఁగుదు నీ తనూజ నను దుఃఖము కంటెను జచ్చు టొప్పగున్. **(4-95,96)**

కోపోద్రిక్తుడైన నిటలాక్షుని జటనుంచి ఉద్భవించిన వీరభద్రుని రౌద్రస్వరూపం ఈ విధంగా వర్ణింప బడింది.

అభ్రం లిహోదభ్ర విభ్రమాభ్రభ్రమ కృష్ణనీల దీర్ఘ శరీర మమరఁ
బ్రజ్వలజ్జ్వలన దీప్త జ్వాలికాజాల జాజ్వల్యమాన కేశములు మెఱయఁ
జండదిగ్వేదండ శుండాభ దోర్దండ సాహస్ర ధృత హేతిసంఘ మొప్ప
వీక్షణత్రయలోక వీక్షణద్యుతిలోక వీక్షణతతి దుర్నిరీక్ష మగుచుఁ

గ్రకచ కఠిన కరాళ దంష్ట్రలు వెలుంగ, ఘన కపాలాస్థి వనమాలికలును దనర
నఖిలలోక భయంకరుఁ డగుచు వీర, భద్రుఁ డుదయించె మాఱట రుద్రుఁ డగుచు. **(4-108)**

పినతల్లి చేసిన పరాభవానికి పరితపించి తపస్సు చేయటంకోసం అడవికి వచ్చిన ధ్రువకుమారునికి నారద మహర్షి నారాయణమూర్తిని ఈ సీసపద్యంలో పరిచయం చేస్తాడు.

హారకిరీట కేయూర కంకణ ఘన భూషణుఁ డాశ్రిత పోషణుండు
లాలిత కాంచీకలాప శోభిత కటి మండలుం డంచిత కుండలుండు

మహనీయ కౌస్తుభమణి ఘృణి చారుగ్రైవేయకుం డానంద దాయకుండు
సలలిత ఘనశంఖ చక్ర గదా పద్మ హస్తుఁడు భువనప్రశస్తుఁ డజుఁడుఁ
గ్రమసౌరభ వనమాలికాధరుండు, హతవిమోహుండు నవ్యపీతాంబరుండు
లలిత కాంచన నూపురాలంకృతుండు, నిరతిశయ సద్గుణుఁడు దర్శనీయతముఁడు **(4-251)**

గోరూపధారిణియైన భూదేవి నుంచి పృథుచక్రవర్తి సమస్త సస్యములను పితికిన విషయ మీక్రింది పద్యంలో తెలుపబడింది.

మనువును దూడఁజేసి గరిమన్ నిజపాణితలంబు లీల దో
హనముగఁ జేసి యందు సకలౌషధులం బితికెం గ్రమంబునన్
దనరఁగఁ దద్విధంబునను దత్పృథువత్సలయైన భూమియం
దనయము వారు వారును బ్రియంబగు కోర్కులఁ బొంది రున్నతిన్. **(4-501)**

ప్రణయకోపం వహించిన తన ప్రియురాలిని పురంజనుడు ఈ విధంగా బతిమాలుకుంటాడు-

సరసోదారసుధార సోపమవచశ్చాతుర్య సౌభాగ్యమై,
హరినీలోపమ కోమలాలకయుతంబై, విభ్రమ భ్రూలతా
పరిపుష్ట స్మిత సద్విలోకనమునై భాసిల్లు యుష్మన్ముఖాం
బురుహంబున్ భవదీయదాసునకుఁ బూఁబోణీ! గృపం జూపవే! **(4-791)**

ప్రచేతసులు శ్రీ మహావిష్ణువును స్తుతించిన తీరు చిత్తగించండి.

పూని భవత్పదాంబురుహ మూలనివాసులమైన మేము మే
ధానిధి! నీ విలోకనముఁ దక్కఁగ నన్యముఁ గోరనేర్తుమే?
మానిత పారిజాతకుసుమ స్ఫుట నవ్యమరంద లుబ్ధ శో
భానయశాలియైన మధుపంబు భజించునె యన్యపుష్పముల్? **(4-985)**

ఈ ప్రకారంగా చక్కని సన్నివేశాలతోకూడి భక్తి ప్రపత్తులను ప్రబోధించే చతుర్థస్కంధంలోని కథలన్నిటినీ మైత్రేయుడు విదురునికి వినిపించినట్లు శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు వినిపించాడు.

పోతన భాగవతం అక్షరాస్యు లందరికీ అందుబాటులో ఉండే నిమిత్తం సరళ గద్యానువాద సహితంగా

ప్రకటించాలని తిరుమల తిరుపతి దేవస్థానములవారు సంకల్పించారు. ఈ సదుద్దేశంతోనే పోతన భాగవతం ప్రాజెక్టు ప్రారంభింపబడింది. ఈ మహాకార్యంలో నాకు అవకాశం కల్పించిన కార్యనిర్వహణాధికారి శ్రీ ఎన్. లక్ష్మీనారాయణ, ఐ.ఏ.ఎస్., గారికి నా నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను.

అనువాద భాగాలన్నింటినీ పరిశీలించి పరిష్కరించి ఏకసూత్రత కల్పించే భారం నా మీద ఉంచిన డాక్టర్ రావుల సూర్యనారాయణమూర్తి, పి.ఆర్.ఓ., గారికి నా అభివందనాలు. ఈ సందర్భంలో నాకు సంపూర్ణంగా సహకరిస్తున్న శ్రీ కె. సుబ్బారావు, ఎడిటర్ గారికి నా కృతజ్ఞతా పూర్వక అభివాదాలు.

ఈ స్కంధాన్ని సరళగద్యంలో అనువదించినవారు శ్రీ శనగన నరసింహస్వామి, ఎం,ఏ., గారు. శ్రీశనగనవారు సుప్రసిద్ధ కవులు. మంచివక్తలు. ప్రస్తుతం వీరు విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా ఉన్నారు. శ్రీ నరసింహస్వామిగారి గద్యానువాదం సరసంగా సరళంగా మూలవిధేయంగా కొనసాగింది.

ఈ గ్రంథాన్ని ముచ్చటగా ముద్రించిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ విజయకుమార్‌రెడ్డి గారికీ,, వారి సిబ్బందికీ నా సాధువాదాలు.

ముద్రారాక్షసాలు దొరలకుండా సహస్రాక్షులై ప్రూపులు సరిదిద్దిన పూజ్యమిత్రులు శ్రీముదివర్తి కొండమాచార్యులవారికీ, శ్రీములుకుట్ల రామకృష్ణ శాస్త్రిగారికినీ ధన్యవాదాలు. ముద్రణకు తగినట్లు ప్రెస్ కాపీ సిద్ధంచేసి యిచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ ఎం.ఏ., ఎం.ఫిల్. కు నా ఆశీర్వాదాలు.

భవదీయుడు

కరుణశ్రీ

ప్రధాన సంపాదకుడు

పోతన భాగవతము

తిరుపతి,

10-2-86